# గేదె పాలు - SKU

Back Home

ఈ పేజీని పంపండి

మా ఆఫీస్ లో కాఫీ వుంటుంది కానీ దానిలోకి క్రీమ్ కి బడ్జెట్ లేదు. అంటే, కాఫీ లోకి పాలు తెస్తారు కానీ ఎవరూ మరి క్రీమ్ తో తాగరు అనుకుంటా కావలిస్తే నేను వెళ్ళి తెస్తూ వుంటాను. మొన్న ఆఖరికి వుండబట్టలేక ఆ పాలబ్బాయి ని (అదే, పాలు వారం వారం తెచ్చే మా Software Director ని) అడిగేసాను, "ఏమీ మన ఆఫీస్ లో ఎవరూ కాఫీ ని క్రీమ్ తో తాగరా.. పాలొక్కటే తెస్తారు?" అని. దానికి "ఏమీ నీకు క్రీమ్ కావాలా? సరే, ఈ సారి నుండి క్రీమ్ కూడా తెస్తాను లే" అని చెప్పారు. "నాకు కాఫీ నీళ్ళగా వుంటే నచ్చదు, అందుకే పాల బదులు క్రీమ్ కలుపుకుంటా" అన్నాను.

కాఫీ టాపిక్ వచ్చింది కదా.. కాఫీ గురించి కాకినాడ దాకా రింగులు తెప్పేస్తా.. సరేనా?

* * *

మా ఇంట్లో నాన్నగారు, అమ్మమ్మ, పెద్దమ్మలూ, పెదనాన్నగార్లూ అందరూ కాఫీ విషయం లో మహా పర్టిక్యులర్! మా నాన్నగారు అయితే మరీను! రోజూ పొద్దుటే రేడియో సుప్రభాతం తో నిద్ర లేచినా, పక్క మీద నుంచి లేవటం మాత్రం చాలా రోజుల వరకూ మా నాగేశ్వరరావు పిలుపుతోనే.

కాకినాడ ని "మా" అన్నా సరిపెట్టుకోవచ్చు కానీ ఎవరో మొగాడ్ని పట్టుకొని "మా" అంటుందే మిటీ అని ఆలోచిస్తున్నారా?

చిన్న మెదడు ని మరీ అంతలా చితకబాదేయకండి! నాగేశ్వరరావు మా పాలబ్బాయి. అతను మా నాన్నగారి ఆప్తమిత్రుడు లెక్క! మా పెద్దమ్మ వాళ్ళ ఇంట్లో బోలెడన్ని గులాబీ మొక్కలు వుండేవి. వాటి పెంపకం గురించి సలహాలూ, చిట్కాలు తెలుసుకోవటానికి మా గాంధీనగరం పార్క్ లో గులాబీ తోట లో పని చేసే నాగేశ్వరరావు దగ్గరకి పెద్దమ్మ, బతికున్న రోజుల్లో మా పెదనాన్నగారూ అస్తమానూ అతన్ని సంప్రదించేవారు. ఒకసారి ఏవో మాటల మధ్య తనకి గేదెలు వున్నట్టు ఆ నాగేశ్వర్రావు చెప్తే, పెదనాన్నగారు ఓ గేదె ని తమ ఇంటికి తీసుకొచ్చి పాలు తీయమని అడిగారు. తన దగ్గర వున్న ఒక్క గేదె పాలూ అల్రెడీ బేరాలు వున్నాయని అతను చెప్తే, సరే అని ఒక రెండు వేలు ఇచ్చి, రెండో గేదె (అదీ గొడ్డు గేదె) కొని దాన్ని తీసుకురమ్మన్నారు. అలా నాగేశ్వరరావు మా పెదనాన్నగారు వాళ్ళకి పాలు పోయటం మొదలెట్టాడు. వాళ్ళెంత ఇద్దరు మనుష్యులు, పాలు మిగిలిపోతున్నాయి, మీకేమన్నా కావాలా అని మమ్మల్ని అడిగితే, మా నాన్నగారు సరే అన్నారు. అలా అక్కడ పెదనాన్నగారు వాళ్ళ ఇంటి దగ్గర పాలు తీసి, అక్కడ పోసి, మిగిలినవి తెచ్చి మాకు పోసేవాడు.

మొదట్లో పాలు మంచి చిక్కగా వుండేవి. అందరికీ తెగ గొప్పగా చెప్పేవారు నాన్నగారు. "మా నాగేశ్వరరావు పాల తో తోడు పెట్టిన పెరుగు అలా కత్తి తో కోసేలా గట్టిగా వస్తుంది.. అంత చిక్కగా వుంటాయి పాలు" అని.

నెమ్మదిగా, పక్కవీధి లో పెదనాన్నగారు ఇంటి నుండి పాలు మా ఇంటికి వచ్చే లోపు పాలు

పలుచన అయిపోవటం మొదలయింది. దానికి కొంతవరకూ కారణం దారిలో మునిసిపల్ కుళాయి వుండటం అయితే, మరొకటి పెద్దమ్మ వాళ్ళ ఇంట్లో అద్దెకున్న వాళ్ళ బేరం కూడా దొరకటం! మంది ఎక్కువ అయితే మజ్జిగ, పాలూ కూడా పలుచన అయిపోతాయి మరి!

రేటు మాత్రం పేకెట్ పాల కన్నా చాలా ఎక్కువ వుండేది. పోనీ మానేద్దాం అంటే అప్పటికి చిక్కటి పాలు మరిగేసాం ఇంట్లో అందరం. సరే, అని మూడో గేదె కొనటానికి నాన్నగారు నాగేశ్వరరావు కి డబ్బులు ఇచ్చారు. దానితో మూడో గేదె కొని మా ఇంటి దగ్గర దాని పాలు తీయటం మొదలెట్టాడు. మరి బేరాలు పెరగటం తో, తన భార్య కి కూడా ఈ పాలు తీయటం నేర్పించి తనని పెదనాన్నగారి ఇంటి దగ్గర వదిలి తను మా ఇంటి దగ్గర పాలు తీయటానికి వచ్చేవాడు.

ఇంకా చుట్టు పక్కల బేరాలు పెరిగే కొద్దీ అతని గేదెలు కూడా పెరిగాయి. కొత్త గేదెల్ని కొని మొత్తానికి పన్నెండు గేదెల యజమాని అయ్యాడు నాగేశ్వరరావు. తనూ, భార్య, కొడుకూ, కూతురు, ఒక పాలేరు ఇలా మొత్తం అయిదుగురు వచ్చే వారు త్వరత్వరగా ఈ పాలు తీసే కార్యక్రమం కానీయటానికి. ఎంత మంది వచ్చినా మాకు మాత్రం నాగేశ్వరరావే పాలు తీయాలి అని నాన్నగారు పట్టు పట్టేవారు. దానికి కారణం, నాగేశ్వరరావు అయితే నాన్నగారు చెప్పక్కర్లేకుండా గేదె పొదుగు కడిగిన నీళ్ళ గిన్నెని పూర్తి గా వంచేవాడు. కొడుకు కానీ, భార్య కానీ, ఇంక మిగిలిన ప్రతివాళ్ళు చలాగ్గా నీళ్ళ గిన్నెని తిప్పి, ఒక్క వంపు వంపి పూర్తిగా నీళ్ళు ఒలకపోయకుండానే పాలు తీసేసేవారు. ఖర్మ కాలీ ఏరోజన్నా నాగేశ్వరరావు రాకపోతే వాళ్ళతో గిన్నె పూర్తిగా వంచలేదని నాన్నగారు వాదనేసుకునేవారు.

నాన్నగారికి ఏమీ ఎదురు చెప్పలేక, అస్సలు నీళ్ళు కలపని పాలు పొయ్యలేక నాగేశ్వరరావు సతమతమయ్యేవాడు. దానితో నెమ్మదిగా "సుబ్బారావు గారు నాకు పార్కు లో పొద్దుట డ్యూటీ వేసారండీ, నేను సీతమ్మ గారి (మా పెద్దమ్మ) ఇంటికి పోసేసి డ్యూటీ కి వెళ్ళిపోతాను, మీకు రేపటి నుండీ మా సుబ్బలక్ష్మి (వాళ్ళావిడ) పోస్తుంది" అని నాన్నగారి నెత్తి మీద పిడుగు వేసాడు. సుబ్బలక్ష్మి మహాతెలివైనది. నాన్నగారు నీళ్ళ గిన్నె పూర్తిగా వంచి వుంచమంటే, "ఇలా అయితే పొద్దు ఇక్కడే గడిచిపోతుంది" అని నిర్మొహమాటం గా అనేసింది. దానితో నాన్నగారికి చెప్పలేని ఉక్రోషం వచ్చింది. "అయితే మాకు ఈ నెలాఖరు నుండీ పాలు వద్దు" అని చెప్పేసారు.

కొన్ని విషయాల్లో మా నాన్నగారు అచ్చు మా అమ్మమ్మ లాంటి వాళ్ళే. ఎంతైనా అప్పాతమ్ముళ్ళు కదా! అమ్మమ్మ అద్దెకున్న వాళ్ళతో విరసాలు వచ్చినప్పుడు సైలెంట్ వార్ ఏ విధం గా చేసేదో, అదే విధం గా నాన్నగారు పాల విషయం లో చేసేవారు.

అంటే, అమ్మమ్మ అప్పటికి రోజూ పొద్దుతే ఒక్కర్తీ తన ఇంట్లో కాఫీ కలుపుకుని తాగేసేది అమ్మ కలిపే కాఫీ నచ్చక. నాన్నగారు తను పాలు మానేయగానే అమ్మమ్మ కూడా మానేస్తుంది అనుకున్నారు. మానేయలేదు. దానితో పొద్దుటే మేము పేకెట్ పాల తో కాఫీ తాగుతుంటే, తను మాత్రం గేదే పాలతో చేసిన చిక్కటి కాఫీ తాగుతుంటే, ఈయన మనసు ఇక్కడ మూలిగేది. పోనీ మళ్ళీ పాలు మొదలెడదాం అంటే పౌరుషం. ఇంకెవరినైనా పాలబ్బాయి కుదుర్చుకోవటానికి వాళ్ళకీ వాళ్ళకీ ఏవో ఒప్పందాలు ఎవరూ వచ్చేవారు కాదు. చాలా సతమతమయ్యేవారు. ఈ లోగా ఎప్పుడో పార్కు లోనో రోడ్ మీదో కనపడేవాడు నాగేశ్వర రావు ఆయనకి. లేకపోతే, అతని గేదెల పరివారం లో ఏదో ఒక గేదె ఈనేది.

నాన్నగారికి జున్ను అంటే మహా మక్కువ. అది చక్కగా గుర్తు పెట్టుకునేవాడు నాగేశ్వర రావు. మాకు వాడుక లేకపోయినా జున్ను పాలు మాత్రం తెచ్చి ఇచ్చేవాడు "సుబ్బారావు గారు మీకు ఇష్టం అని జున్ను పాలు తెచ్చానండీ" అంటూ.

అంతే, వెన్నలా కరిగిపోయేవారు నాన్నగారు. అక్కడి మెలోడ్రామా కి మాకూ, మా అమ్మగారికి భలే నవ్వు వచ్చేది. ఇద్దరూ, సుదీర్ఘ వియోగం తరువాత కల్సుకున్న అత్యంత సన్నిహిత వ్యక్తుల మాదిరి నిష్ఠూరాలు పోయేవారు, "అబ్బెబ్బే కోపం ఏమీ లేదు" అనుకునేవారు, చివరకి మళ్ళీ వాడుక మొదలెట్టేవారు నాన్నగారు నాగేశ్వర రావు దగ్గర.

ఎన్నాళ్ళూ ఆ సంబడం? మళ్ళీ నాగేశ్వర రావు రంగం లోంచి తప్పుకునేంతవరకూ. అంతే, మళ్ళీ షరా మామూలే!

ప్రస్తుతం పెద్దమ్మ కూడా పోయింది. అమ్మమ్మ పోయింది. మేము ఇలా ఎవరి మానాన వాళ్ళం వెళ్ళిపోయాము. నాన్నగారు, అమ్మ ఒక్కళ్ళే కాకినాడ లో వున్నారు. నాగేశ్వర రావు కూడా పిల్లలందరికీ పెళ్ళిళ్ళు చేసి, మనవలని కూడా ఎత్తుకున్నాడు. కానీ నాన్నగారికీ నాగేశ్వరరావు గేదె పాలకీ మధ్య ఆ bitter-sweet అనుబంధం మాత్రం అలాగే కొనసాగుతోంది.

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి